

# సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com

## నిజామాబాద్ కామారెడ్డి



మంగళవారం 2 డిసెంబర్ 2025 5 పేజీలు


# ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు



## -సామాన్యుల జేబులకు మంట



సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి

స్థానిక మార్కెట్లల్లో కూరగాయల ధరలు భారీగా పెరిగి సామాన్యులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. ఏ కూరగాయ అడిగినా కిలోకు రూ. 100 పైగా చెప్పడం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇటీవల వాతావరణ మార్పులు, అతివృష్టి కారణంగా కూరగాయలు సహా ఉద్యాన పంటలకు గణనీయమైన నష్టం కలగడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. మార్కెట్‌లో బీరకాయ, కాకరకాయ, గోబీ, పూల్‌గోబీ, టమాటా, వంకాయ, చిక్కుడు, క్యారెట్ వంటి ముఖ్య కూరగాయలు అన్ని రూ. 100 దాటడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.అల్లం, పచ్చిమిర్చి ధరలు మరింత పెరిగి సామాన్యుల బడ్జెట్‌కు చేరని స్థాయిలో ఉన్నాయి. పచ్చిమిర్చి ధరలు ప్రత్యేకించి కుటుంబాలపై అదనపు భారంగా మారాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గడం, ఆదాయం పరిమితమవడంతో ప్రజలు తమ రోజువారీ ఖర్చులను నిర్వహించడంలో ఇబ్బందులు పడుతున్నారు. 2లో

### నామినేషన్ల స్వీకరణలో

# పొరపాట్లకు తావు ఉండకూడదు

### - కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి

నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. గ్రామ పంచాయతీ రెండవ విడత ఎన్నికలకు సంబంధించి నిజామాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాలతో పాటు జక్రాన్పల్లి మండలంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సోమవారం మోపాల్ మండలం కులాస్‌పూర్, జక్రాన్పల్లి మండలం పడకల్ గ్రామ పంచాయతీల ఆకస్మికంగా సందర్శించారు. నామినేషన్ల స్వీకరణ తీరును పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, మొదటి అంకమైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల (మిగతా 2లో)



### ఎన్నికలలో ఎలాంటి పొరపాట్లకు

# తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలి

### - ఎన్నికల సాధారణ పరిశీలకులు సత్యనారాయణ రెడ్డి

సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి

గ్రామ పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో బ్యాలెట్ బాక్స్‌ల వినియోగం-సంసిద్ధత-భద్రత పై జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సాధారణ పరిశీలకులు సత్యనారాయణ రెడ్డితో కలసి సోమవారం నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయితీ సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, పోలింగ్‌లో వినియోగించే బ్యాలెట్ (మిగతా 2లో)



# అక్రమ కట్టడాలపై మున్సిపల్ కొరడా....!

సూర్య కామారెడ్డి టౌన్

కామారెడ్డి పట్టణంలో వీక్లీ మార్కెట్ రోడ్‌లోని ఇసుక డంపులను కల్లు దుకాణం మిగతా రేకుల షెడ్డులను ప్రభుత్వ స్థలం సర్వే నంబర్ 6 లో నిర్మించినటువంటి ఇతర నిర్మాణాలతోపాటు, మునిసిపల్ స్థలంలో నిర్మించినటువంటి ఎలాంటి అక్రమ నిర్మాణాలైనా పోలీసుల , రెవెన్యూ అధికారుల సహకారంతో మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చి తొలగించడం జరిగింది. అక్కడ మునిసిపల్ స్థలంలో నిర్మించినటువంటి నిర్మాణంలో వున్న వారు మాకు ఎలాంటి నోటీస్ ఇవ్వలేదు, మాకు తెలియకుండానే దౌర్జన్యంగా నేలమట్టం చేస్తున్నారని వారు కోరారు.



# ఎన్నికలలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలి

**(మొదటి పేజి తరువాయి)**

బాక్సుల పంపిణీ, భద్రత, నిల్వ, రవాణా, సీలింగ్ వంటి అన్ని అంశాల పై గ్రామపంచాయతీ ఎన్నికల నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహిస్తు ఎన్నికలలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండ పారదర్శకంగా సజావుగా నిర్వహించాలని ఎన్నికల సాదారణ పరిశీలకులు అన్నారు.సోమవారం జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సమావేశ నిర్వహించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తీసుకున్న చర్యలు, ఎన్నికల పోలింగ్ వరకు తీసుకోవాల్సిన చర్యలు, రెండవ విడత నామినేషన్ ప్రక్రియ రేపటి తో ముగియనున్నందున చేపడుతున్న చర్యలు పై నోడల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బ్యాలెట్ పేపర్ల ముద్రణ, మెటీరియల్ మేనేజ్మెంట్ ,ఎన్నికల సిబ్బంది, జోనల్ అధికారుల నియామకం, ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించి ప్రతిరోజు నివేదికలు పంపే విధంగా ఎం సి సి నోడల్ అధికారి, అభ్యర్థులు ఖరారు అయిన తర్వాత అభ్యర్థుల ఖర్చులకు సంబంధించిన వివరాలు రిపోర్టులను ఎక్స్పెండిచర్ నోడల్ అధికారి ,బ్యాలెట్ పేపర్లను బ్యాలెట్ అధికారి చూడాలని, రాజకీయ ప్రకటనలకు సంబంధించి మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ, సోషల్ మీడియా ద్వారా నిర్వర్తించే విధులు సంబంధిత అధికారి పర్యవేక్షించాలని నోడల్ అధికారులు మరోసారి వారికి కేటాయించిన విధులను పై అవగాహన చేసుకోని ఎన్నికల నియమ ,నిబంధనలను క్షుణ్ణంగా చదివి ఎక్కడ తప్పులు దొర్లకుండా విధులు నిర్వహించాలని, అధికారులు, టెక్నికల్ టీములు, రవాణా విభాగం, ఎన్నికల శాఖ సిబ్బందికి తమ తమ విధులను సక్రమంగా నిర్వహించాలని ఎన్నికల నియమ. నిబంధనలు పాటించాలని ఆన్నారు.

**- బ్యాలెట్ బాక్స్‌ల సంఖ్య-అందుబాటు-నాణ్యత తనిఖీ**

ప్రతి మండలానికి అవసరమైన బ్యాలెట్ బాక్స్ లను లెక్కించి జాబితా ఖరారు చేయాలి.పాడైపోయిన, వినియోగయోగ్యం కాని బాక్స్ లను వెంటనే మార్చాలి. బాక్స్ ల లాక్‌లు, స్లాట్‌లు, సీల్ పాయింట్లు సక్రమంగా పనిచేస్తున్నాయా నిర్ధారించాలి.

**- భద్రత & నిల్వ**

బ్యాలెట్ బాక్స్‌లు డిపాజిట్ కేంద్రాలలో 24ఐ7 భద్రతతో భద్రపరచాలి. సీసీ కెమెరా పోలీసు పహారా తప్పనిసరి. ఏ విధమైన అనధికార ప్రవేశం ఉండకూడదు.

**- రవాణా సన్నాహాలు**

పోలింగ్ రోజు బాక్స్‌లను సురక్షితంగా పోలింగ్ స్టేషన్లకు తరలించడానికి ప్రత్యేక రవాణా ప్రణాళిక సిద్ధం చేయాలి, రవాణా వాహనాలకు GPS, సెక్యూరిటీ సిబ్బంది, సీల్డ్ వాహనాల వినియోగం పరిశీలించాలి.బిపోలింగ్ అనంతరం బాక్సుల రిసీవ్ ,స్ట్రాంగ్ రూం ఏర్పాట్లుపోలింగ్ ముగిసిన తర్వాత Presiding Officers నుండి బాక్సులను స్వీకరించే కౌంటర్లు సిద్ధం చేయాలి, పార్టీ ఏజెంట్లు సమక్షంలో సీలింగ్ ప్రక్రియను పూర్తి చేయాలి.

**- శిక్షణ & అవగాహన**

POT, APOలు, పోలింగ్ సిబ్బందికి బ్యాలెట్ బాక్స్ వినియోగం, సీలింగ్, ప్యాకింగ్ విధానం పై ఇస్తున్న ప్రత్యేక శిక్షణ లో అన్ని అంశాల పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.పోలింగ్ స్టేషన్ స్థాయి అధికారులందరూ బ్యాలెట్ పేపర్లు %డ% బాక్స్ హ్యాండ్లింగ్‌లో ఏ తప్పిదం జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు .ఈ సమావేశం లో అదనపు కలెక్టర్లు విక్టర్, మదన్ మోహన్, సీఈఓ చందర్, నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ల స్వీకరణలో పొరపాట్లకు తావు ఉండకూడదు

**(మొదటి పేజి తరువాయి)**

సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాలని అన్నారు. నామినేషన్ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలు పరిశీలించారు. రెండవ విడత నామినేషన్ల ప్రక్రియ ఆదివారం ప్రారంభమైందని, మూడు రోజుల పాటు నామినేషన్లు స్వీకరిస్తారని అన్నారు. చివరి రోజున ఎక్కువ మంది నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉన్నందున, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. చివరి సమయంలో ఏదైనా పొరపాటు జరిగితే నామినేషన్ తిరస్కరణకు గురవుతు ందని, అందుకని అభ్యర్థులు ముందు జాగ్రత్త వహించాలన్నారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే హెల్ప్ డెస్క్ ను సంప్రదించాలని సూచించారు. ఉదయం 10.30 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని తెలిపారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

## ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు

**(మొదటి పేజి తరువాయి)**

మాంసం, గుడ్ల ధరలు కూడా పెరగడంతో సాధారణ కుటుంబాలు కనీసం కూరగాయలు, పప్పులతో అయినా భోజనం పెట్టుకోవడానికే కష్టాలు ఎదుర్కొంటున్నాయి. ఈ పరిస్థితుల్లో “మేమేం తిని బతకాలి…?” అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రణలోకి రావడానికి ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని వారు కోరుతున్నారు. ప్రజా ప్రభుత్వం అంటూ చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం కూరగాయల ధరలను సామాన్యుల ఆదాయానికి అందుబాటులో ఉంచే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



## పల్లెబోగుడ సర్పంచ్‌తో పాటు, వార్డు సభ్యులందరు ఏకగ్రీవం

### - ఏకగ్రీవ తీర్మాణం చేసిన గ్రామస్తులు

**సూర్య, నాగిరెడ్డిపేట్**

నాగిరెడ్డి పేట్ మండలంలోని పల్లెబోగుడ గ్రామ సర్పంచ్ తో పాటు, వార్డు సభ్యులందరినీ సోమవారం గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకొంటు తీర్మానం చేశారు. పల్లెబోగుడ గ్రామపంచాయతీ ఎన్నికలు రెండో విడతలో జరగనున్నాయి. పల్లెబోగుడ సర్పంచ్ స్థానాన్ని ఎస్టి మహిళకు కేటాయించారు. ఈ గ్రామ పంచాయతీలో 8 వార్డులు ఉన్నాయి. గ్రామంలో పంచాయతీ ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించుకునేందుకు సోమవారం గ్రామస్థులు సమావేశమైయ్యారు. పంచాయతీ ఎన్నికలను ఏకగ్రీవం చేయాలని తీర్మానించారు. గ్రామ సర్పంచ్ గా ధనావత్ పార్వతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వార్డులవారిగా 1 వ వార్డుకు ధనావత్ గోవింద్, 2 వ వార్డుకు అజ్మేరా ముత్యాలి, 3 వ వార్డుకు ధనావత్ రాందాస్, 4వ వార్డుకు దేవ్ సోత్ సునీత, 5వ వార్డుకు లకావత్ శాంత, 6 వ వార్డుకు లకావత్ బలరాం, 7వ వార్డుకు అజ్మేరా సేవ్‌లా 8వ వార్డుకు ధనావత్ అనిత లను వార్డు సభ్యురాలుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు గ్రామస్తులు తెలిపారు. 8వ వార్డు సభ్యురాలు ధనావత్ అనిత ను ఉప సర్పంచ్ గా ఏకగ్రీవంగా తీర్మానం చేసుకుని ఎన్నుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.




## విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

**సూర్య- బిక్కనూర్**

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, మండల వైద్యురాలు దివ్య విద్యార్థులకు సూచించారు. సోమవారం మండల కేంద్ర శివారు లో ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షే మ గురుకుల పాఠశాల మరియు కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం అవసరమున్న విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భోజనం చేసేటప్పు డు చేతులు శుభ్రంగా కడుక్కొని తినాలని, వైద్యుల సూచనలు పాటించాలని వివరించారు. ఈ కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ రఘు, ఆరోగ్య విస్తీర్ణ అధికారి వెంకటరమణ, కళాశాల వైస్ ప్రిన్సిపల్ కిషన్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు ఉన్నారు.




## రెండవ రోజు సర్పంచ్ నామినేషన్ల స్వీకరణ

### - 49 సర్పంచ్ అభ్యర్థులు 78 మంది వార్డు అభ్యర్థుల నామినేషన్ పత్రాలు స్వీకరణ

### - ఎంపీడీవో తాహెరా బేగం

**సూర్య ఎల్లారెడ్డి**

రెండవ రోజు ఎల్లారెడ్డి మండలంలోని, 31 గ్రామాల నుండి రెండవ రోజు నామినేషన్ లో ప్రక్రియలో భాగంగా సర్పంచ్ అభ్యర్థులు 49 మంది 78 మంది వార్డ్ అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎంపీడీవో దాహర బేగం కు సర్పంచ్ వార్డు సభ్యులు తమ నామినేషన్ పత్రాలను దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీవో తాహెరా బేగం తెలిపారు. రేపు ఆఖరి రోజు అయినందున ఆసక్తి గల సర్పంచ్ వార్డ్ మెంబర్ సభ్యులు తమ నామినేషన్ ధృవపత్రాలను సాయంత్రం ఐదు గంటల లోపు అందజేయాలని ఆమె తెలిపారు.

## రైతులు ఆలయ దూడలకు వరిగడ్డిని అందించాలి

**సూర్య- బిక్కనూర్**



మండల కేంద్ర శివారులో ఉన్న దక్షిణ కాశీగా పిలవబడే సిద్దిరామేశ్వర ఆలయంలో ఉన్నదూడలకు భక్తులు, రైతులు వరిగడ్డిని వితరణగా అందించాలని ఆలయ పునర్ని ర్మాణ కమిటీ అధ్యక్షుడు తాటిపా ముల లింబాద్రి కోరారు. సోమవారం మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామా నికి చెందిన పోచమ్మల బాబు, చాకలి నరసింహులు, మంగలి బాబు, చాకలి ఎల్లంలు ఒక ట్రాక్టర్ వరిగడ్డిని సోమవారం ఆలయ దూడల కోసం వితరణగా అందజేశారు. ఈ సందర్భ ంగా వారిని ఆలయ పునర్ని ర్మాణ కమిటీ అధ్యక్షుడు తాటిపాముల లింబా ద్రి అభినందించారు. ఈ కార్యక్ర మంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ అందే దయాకర్ రెడ్డి, కమిటీ డైరెక్టర్లు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

## నాగిరెడ్డి పేటలో రెండవ రోజు సర్పంచ్ స్థానాలకు 44 నామినేష్నల్లు దాఖలు

### - వార్డ్ సభ్యుల స్థానాలకు 75 నామినేషన్లు దాఖలు.

**సూర్య, నాగిరెడ్డిపేట్**

నాగిరెడ్డి పేట్ మండలంలో నామినేషన్ల స్వీకరణ రెండవ రెండవ రోజు సోమవారం సర్పంచ్ స్థానాలకు 44 మంది అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేసినట్టు ఎంపీడీవో లలిత కుమారి తెలిపారు. మండలంలో 27 గ్రామ పంచాయతీలు ఉండగా , అందులో సోమవారం వివిధ గ్రామ పంచాయతీలలో సర్పంచ్ స్థానానికి 44 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఆత్మకూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానానికి ఇద్దరూ, బంజారా తండా గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి ముగ్గురు, బెజ్గం చెరువు తండా గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి ఒక్కరు, బొల్లారం గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి ఒకరు, చిన్న ఆత్మకూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి ఇద్దరూ, చినూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి ముగ్గురు, ధర్మ రెడ్డి గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి ఒక్కరు, గోలి లింగాల గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి ఇద్దరూ, గోపాల్ పెట్ గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి ఆరుగురు, జప్తి జనకంపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి ఒక్కరు, జలాల్పూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి ముగ్గురు, కన్నా రెడ్డి గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి ఒకరు, లింగంపల్లి కలాన్ గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి ఒక్కరు, మాల్ తుమ్మెద గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి ఒకరు, మెల్ల కుంట తండా గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి ముగ్గురు, నాగిరెడ్డిపేట్ గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి ముగ్గురు, పల్లె బొగ్గుడ తండా గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి ఒక్కరు, పోచారం గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి ఇద్దరూ, రాఘవపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి ఇద్దరూ,




తాండూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి ఇద్దరూ, వెంకంపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి ఒకరు, వాడి గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి ఇద్దరు, సర్పంచ్ స్థానాలకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్టు ఆమె తెలిపారు. అలాగే వివిధ గ్రామపంచాయతీల వార్డులకు గాను 75 మంది అభ్యర్థులు వార్డు సభ్యులుగా నామినేషన్లు దాఖలు చేసినట్టు ఎంపీడీవో లలిత కుమారి తెలిపారు.

# జిల్లా పోలీసుల కళాబృందం ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి , తాడ్ వాయ్ మండలాల్లో అవగాహన కార్యక్రమాలు

## - శాంతియుత ఎన్నికలు, ప్రజల భద్రత లక్ష్యంగా పోలీస్ కళాబృందం విస్తృత ప్రచారం

**సూర్య ఎల్లారెడ్డి**

సైబర్ నేరాలు, డ్రగ్స్, రోడ్డు భద్రతపై ప్రజలకు విద్యార్థిని ,విద్యార్థులకు కళాబృందం ద్వారా స్పష్టమైన సూచనలుజిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, ప్రజల అవగాహన, భద్రత, శాంతియుత ఎన్నికల నిర్వహణను లక్ష్యంగా పెట్టుకొని, పోలీస్ కళాబృందం సోమవారం రెండు పోలీస్ స్టేషన్ల పరిధిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిం చారు ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని, ఎల్లారెడ్డి ఆదర్శ పాఠశాల, తాడ్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో తాడ్వాయి మండల కేంద్రంలో నిర్వహి ంచిన అవగాహన కార్యక్రమం సబ్-ఇన్స్పెక్టర్ , బొజ్జ మహేష్, తాడ్ వాయ్ సబ్ ఇన్స్పెక్టర్, వై. నరేష్ , పర్యవేక్షణలో నిర్వహిం చారు ఈ సందర్భంగా షీ టీం సభ్యులు, పోలీసు కళాబృం దం. మాట్లాడుతూ ఎన్నికల సమయంలో







ఎటువంటి ప్రలోభాలకు లోనకాకుండా, పాత కక్షల వల్ల వివాదాలు తలెత్తకుండా శాంతియుత వాతావరణం నెలకొనేలా ప్రజలకు సూచనలు అందించారు. విలువైన ఓటు హక్కును బాధ్యత తో వినియోగించుకోవాలని, అత్యవసర పరిస్థితు ల్లో డయల్ 100 సేవలను ఉపయోగిం చవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో హాజరైన గ్రామస్తులకు కళాబృందం రోడ్డు భద్రత, సైబర్ మోసాలు, డ్రగ్స్ దుష్ప్రభావాలు, బాల్యవివాహాలు మహిళల భద్రత వంటి అంశాలను నాటక రూపంలో సులభంగా అర్థమయ్యేలా ప్రదర్శించారు బ్యాంకుల పేరుతో వచ్చే నకిలీ కాల్స్, లింకులు, ఓటీపీ మోసాలు వంటి సైబర్ నేరాల పద్ధతులపై హెచ్చరిస్తూ, మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాల్సిందిగా సూచించారు. . గ్రామ భద్రతను బలోపేతం చేయడంలో సీసీ కెమెరాల ప్రాధాన్యంను వివరించి, ప్రతి కాలనీ-గ్రామం స్వీయ భద్రత కోసం కెమెరాల ఏర్పాటు తప్పనిసరి అవుతుందని తెలిపారు., ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎల్లారెడ్డి మోడల్ అండ్ జూనియర్ కళాశాలలో కూడా కళాబృందం నిర్వహించారు, విద్యార్థులకు బాల్యవివాహాలు, ప్రేమలో మోసాలు, డ్రంక్ అండ్ డ్రైవ్, మొబైల్ తో డ్రైవింగ్, గంజాయి-డ్రగ్స్ వినియోగం, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు మరియు సోషల్ మీడియా భద్రతపై విస్తృత అవగాహన కల్పించారు. మహిళలు-పిల్లలపై జరిగే నేరాలు, ఫోక్సు చట్టం, గురించి షి టీమ్ సేవల గురించి స్పష్టమైన వివరణ ఇచ్చారు. అలాగే సైబర్ మోసాల నివారణ కోసం 1930, అత్యవసర పరిస్థితులకు డయల్ 100 వినియోగంపై మార్గదర్శకాలు అందించారు. ఈ కార్యక్రమాల్లో తాడ్వాయి, ఎల్లారెడ్డి , పోలీస్ కళాబృందం, షి టీమ్ సభ్యులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్... బిఆర్ఎస్ లో చేరికలు

**సూర్య- బిక్కనూర్**



మండలంలోని అంతంపల్లి గ్రామంలో అధికార కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. సోమవారం సింగిల్ విండో సొసైటీ డైరక్టర్ స్వరూప సిద్దారాము లు తో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోచయ్య,లింబారెడ్డి, యాచాం సురేష్ గుప్తా,రాజిరెడ్డిలు మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సమక్షం లో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి, సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో సొసైటీ చైర్మన్ వలకొండ వెంకట్ రెడ్డి,గ్రామ మాజీ సర్పంచ్ చిట్టడి మధు మోహన్ రెడ్డి పార్టీ నాయకులు ఉన్నారు.

## ఈ నెల 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

మహిళ పిల్లలు వికలాంగులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఈనెల 3 న ఉదయం 10గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమావేశ మందిరంలో జరప డం జరుగుతుందని జిల్లా సంక్షేమ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 28 11 2025 రోజుల నిర్వహించిన పాటల పోటీల్లో విజయం సాధి ంచిన విజేతలు అందరికీ ఆరోజు బహుమతులను ప్రధానం చేయడం జరుగుతుందని కావున జిల్లాలోని వికలాంగులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## జిల్లాలో రోడ్డు భద్రతకు పోలీసుల కీలక చర్య

### - బాన్సువాడ లో నూతన ట్రాఫిక్ విధానం ప్రారంభం

**సూర్య బాన్సువాడ**



జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల ప్రాణ భద్రతను కాపాడే దిశగా జిల్లా పోలీసు శాఖ మరో కీలక ముందడుగు వేసింది. ఈ కార్యక్రమంలో భాగంగా బాన్సువాడ పట్టణంలో నూతనంగా ప్రత్యేక ట్రాఫిక్ వ్యవస్థను ప్రారంభించారు. జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు బాన్సు వాడలో ఒక ట్రాఫిక్ ఎస్సై,నలుగు రు కానిస్టేబుళ్లతో ట్రాఫిక్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ కొత్త వ్యవస్థ మొత్తం ఎస్హెచ్ఓ శ్రీధర్ కుమార్ పర్యవేక్షణలో పనిచేయనుంది. ప్రజలు సురక్షితంగా ప్రయాణించేలా ట్రాఫిక్ సిబ్బంది పట్టణంలోని ప్రధాన రహదా రులపై నిరంతరం పర్య వేక్షణ చేపడతారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లం ఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూనే, ప్రమాదాలను నివారిం చేందు కు అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర మాట్లాడుతూ"ప్రతి ప్రాణం విలువైనదే. ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా మీ కుటుంబాన్ని, మీరు రక్షించు కోవచ్చు. బాన్సువా డలో కొత్త ట్రాఫిక్ వ్యవస్థ ప్రమాదాలను తగ్గించడంలో కీలక పాత్ర పోషి స్తుంది" అని తెలిపారు. ప్రజలందరూ రోడ్డు భద్రత నియ మాలను పాటి స్తూ, ప్రమాదాలు రాకుండా ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని ఎస్పీ పిలుపు నిచ్చారు."మీ క్రమశిక్షణే మీ భద్రత.

## శ్రీకాంతచారి 16వ వర్ధంతి సందర్భంగా చలో ఎల్బీ నగర్

**సూర్య బాన్సువాడ రూరల్**



తెలంగాణ కోసం ప్రాణాలను అర్పిం చిన మొట్టమొదటి అమరుడైన శ్రీకాం తచారి 16వ వర్ధంతి సంద ర్భంగా నిర్వహించే కార్యక్రమానికి నియోజక వర్గం నలుమూలల నుండి ఉద్యమకా రులు తరలిరావాలని టి యు ఎఫ్ నాయకులు విజ్ఞప్తి చేశారు. డిసెంబర్ 3, 2025 (బుధవారం) ఉదయం 8:30 గంటలకు హైదరా బాద్ ఎల్‌బీ నగర్‌లో అమరవీరుడు శ్రీకాంతచారి విగ్ర హానికి నివాళులు అర్పించేం దుకు ప్రతి ఒక్క ఉద్యమ కారుడు హాజరవాల్సింది గా TUF కామారెడ్డి జిల్లా అధ్యక్షు లు ఉడుత గంగాధర్ గుప్త, బాన్సువాడ మండల అధ్యక్షులు గంజివార్ చందు పిలుపు నిచ్చారు. నివాళుల అనంతరం జరిగే సభలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకా రులకు ఇచ్చిన హామీల అమలు పై ఒత్తిడి చేయడం,తెలంగాణ ఉద్యమకా రుల ఆశ యాలను నెరవేర్చే దిశగా నిర్ణ యాలు తీసుకోవడం ముఖ్యఅం శాలుగా ఉండనున్నాయని నిర్వాహకు లు తెలిపారు. కార్యక్రమానికి ప్రొఫెసర్ కోదండరాం ముఖ్య అతిథిగా హాజరు కానున్నారనీ తెలిపారు. మళ్లీ దశకు చేరిన ఉద్యమ ఉత్సాహాన్ని ప్రతిబింబిం చేలా పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలన్నారు..

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

**సూర్య- బిక్కనూర్**



డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికీ జైలు శిక్ష విధించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం రాజంపేట మండలంలోని ఆరేపల్లి తండాకు చెందిన లింబాద్రి, కామారెడ్డికి చెందిన మదన్ లు వేరువేరుగా పోలీసుల తనిఖీలలో మద్యం సేవించి పట్టుబడగా, సోమవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ చంద్రశేఖర్ ముందు హాజరు పరచగా మెజిస్ట్రేట్ లింబాద్రికి వెయ్యి రూపాయల జరిమానా తో పాటు ఒకరోజు జైలు శిక్ష,మదన్ కు ఒకరోజు జైలు శిక్షతో పాటు రెండు వేల జరిమానా విధించినట్లు ఎస్సై ఆంజనేయులు చెప్పారు.

## శబరిమలై కి తరలిన అయ్యప్ప స్వాములు

**సూర్య- బిక్కనూర్**



మండల కేంద్రంలోని హర హర పుత్ర శ్రీ అయ్యప్ప ఆలయం నుండి సోమ వారం అయ్యప్ప మాల ధరించిన స్వాములు శబరిమలై కి తరలి వెళ్లినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఏలేటి మోహన్ రెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలదారులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వ హించి ప్రత్యేక వాహనంలో బయల్దేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు సుబ్బా రావు, శ్రీనివాస్ రెడ్డి, బాల ప్రకాష్, దాబా శేఖర్ ఉన్నారు.

## ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవంలో స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ రికన్స్ట్రక్షన్ పాఠశాల

**సూర్య ఇందూరు**



నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి లోని ఏడవ అంతస్తులో గల సెమినార్ హాల్లో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్,తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ మరియు జిల్లా ఎయిడ్స్ ప్రివెన్షన్ అండ్ కంట్రో ల్ యూనిట్ మరియు స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్నేహ టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ ప్రాజెక్టు నిజామాబాద్ మరి యు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్:రాజశ్రీ హాజరై ప్రసంగించారు. ఎయిడ్స్ వ్యాధి నివారణ కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభు త్వాలు ఎంతో కృషి చేస్తున్నాయని తెలిపారు. తప్పని పరిస్థితుల్లో వృత్తిని ఎంచుకొని జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. మీ కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకొని తమ ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని సూచించారు. ప్రభు త్వం అందిస్తున్న పెన్షన్ తో పాటు సరైన పోషకాహారాన్ని తీసుకోవా లని సమయానుకూలంగా మందులు వాడలని సూచించారు. ప్రతి జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సెక్స్ వర్కర్ల సంక్షేమం వారి మంచి కోసం కృషి చేస్తున్న స్నేహ సొసైటీ నిర్వహిస్తున్న స్నేహ టార్గెటెడ్ ఇంటర్వేన్షన్ ప్రాజెక్ట్ నిర్వాహకులు ఎస్.సిద్దయ్య అందించిన పౌష్టికాహార కిట్ లను అందజే శారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల వైద్య అధికారులు, ఆస్పత్రి అధికారులు, వైద్యులు,వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

**సూర్య కమ్మర్ పల్లి**



కమ్మర్ పల్లి మండల కేంద్రానికి చెందిన చింత. వినీల ప్రదీప్ దంప తులు బాల్కొండ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి సమక్షంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చింత. వినీల ప్రదీప్ దంప తులకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించా రు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ, పథకాలకు అకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భ ంగా సునీల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యమని, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేస్తూ వస్తుందని అన్నారు. ఈ కార్యక్ర మంలో మండల అధ్యక్షుడు సుంకేట రవి,మార్కెట్ కమిటీ చైర్మన్ పాలేపు నర్సయ్య,వైస్ చైర్మన్ సుంకేట బుచ్చన్న, వేణు గోపాల్ యాదవ్, నిమ్మ రాజేంద్రప్రసాద్, సుంకేట శ్రీనివాస్,నల్ల సాయికుమార్, కౌడ శైలెందర్, సంపంగి నాగరాజు,వేములవాడ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్ల అరెస్ట్

**సూర్య మాక్లూర్**

ఆలూరు మండలం కల్లెడ గ్రామంలో పేకాట ఆడుతున్న ముగ్గురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు మాక్లూర్ ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. సోమవారం అర్ధరాత్రి పేకాట ఆడుతున్నరన్న పక్క సమాచారం మేరకు మాక్లూర్ ఎస్ఐ రాజశేఖర్ తన సిబ్బందితో దాడి చేయగా ముగ్గురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 5300 రూపాయలు సీజ్ చేసి కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

# కూరగాయల మార్కెట్ తరలింపు

**సూర్య,భీమ్‌గల్**

వ్యాపార సంస్థలకు, ట్రాఫిక్ కు ఇబ్బందికరంగా మారిన కూరగాయల మార్కెట్ ను తరలించాలని వ్యాపారులు, అఖిల పక్షం ఆధ్వర్యంలో రొడ్డు పై బైటయించారు. గత మూడు, నాలుగు నెలల నుండి మార్కెట్ ను ఓల్డ్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో కి తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎన్ని సార్లు అధికారులకు పిర్యాదు, వనతులు చేసినా అధికారులు మార్కెట్ తరలింపు లో నిర్లక్ష్యం వహిస్తూ వస్తున్నారు. కొందరు కూరగాయల వ్యాపారులు వ్యాపారస్తుల షాప్స్ ఎదుట వారి వ్యాపారాలు ఏర్పాటు చేసుకుని ఇబ్బంది చేస్తున్నారు. దాంతో పాటు ట్రాఫిక్ కు ఇబ్బంది చేస్తున్నారు. విసుగు చెందిన వ్యాపారు లు అఖిల పక్షం సహకారం తో సోమవారం ఆందోళన కు దిగారు. మున్సిపల్ కమీషనర్ తీరును నిరసించారు. కూరగాయల వ్యాపారులకు వంత పడుతున్నట్టు ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో పట్టణంలో ఉద్రిక్త వాతావరణం





నెలకొంది. సోమవారం సంత లో దుకాణాలు ఏర్పాటు చేసేందుకు వచ్చిన వారిని తహసీల్దార్ ఓపెన్ ప్లేస్ కు తరలించారు. చిన్న, చిన్న షాప్ ల వారు ఆందోళన కారుల వినతి మేరకు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో కి వెళ్ళగా, మరి కొందరు అధికారుల ఆదేశాల మేరకు షాప్స్ తీసేందుకు అంగీకరించారు. తహసీల్దార్ మొహమ్మద్ షబ్బీర్, సీఐ సత్యనారాయణ, ఎస్సై లు కే.సందీప్, రాము, అనిల్ రెడ్డి, రాజేశ్వర్ ఆధ్వర్యంలో బందో బస్తు ఏర్పాటు చేశారు.

**-సాయంత్రం వరకు కొనసాగిన ధర్నా...**

కూరగాయల మార్కెట్ తరలింపు డిమాండ్ చేస్తూ సాగిన ధర్నా సాయంత్రం వరకు కొనసాగింది. మార్కెట్ తరలింపులో భాగంగా నలుగురు వ్యాపారులు తమ దుకాణాలు తరలించేందుకు ససేమిరా అని మొండి కేశారు. దాంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అసిస్టెంట్ కలెక్టర్ జోక్యం చేసుకుని పలుమార్లు వ్యాపారులు, నాయకులు, కూరగాయల విక్రయ దారులతో చర్చించారు. సమస్య పరిష్కారం కొరకు సహనం వహించాలని సూచించారు. సమస్య సున్నితం అయినందున ఎప్పటికప్పుడు జిల్లా ఉన్నతాధికారులతో చర్చించారు. సాయంత్రం ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి భీమ్‌గల్ కు చేరుకున్నారు. కలెక్టర్ కరోలిన్ చింగ్థియన్మావి, ఏసిపి వెంకటేశ్వర్ రెడ్డి,సీఐ పొన్నం సంత్యనారాయణ గౌడ్,ఎస్సై లు షాప్స్ తరలించేందుకు ససేమీరా అని కూర్చున్న నలుగురు వ్యాపారులతో మరోసారి చర్చలు జరిపారు.ఇద్దరు వ్యాపారులు వారు తీసుకున్న మడిగేల లోపల మాత్రమే కూరగాయలు విక్రయించుకునేందుకు అంగీకారం తెలుపగా మిగితా ఇద్దరు వ్యాపారులు మెడికల్, సుమంగళి బట్టల దుకాణం అనుకుని ఏర్పాటు చేసిన వారు మొత్తం తొలగించి, నూతన మార్కెట్ కు వెళ్లేలా ఆదేశాలు జారిచేశారు. మెడికల్, సుమంగళి షాప్ ల ను ఆనుకుని ఏర్పాటు చేసిన షాప్స్ తొలగించకుంటే మెడికల్, బట్టల దుకాణం యజమానుల పై కేసు నమోదు చేస్తానని ఏసీపీ హెచ్చరించారు. మార్కెట్ తరలింపు పట్టణం లో సాయంత్రం వరకు ఉద్రిక్త వాతావరణం తెచ్చింది. చివరికి అధికారులు జోక్యం చేసుకుని సమస్య ను సున్నితంగా పరిష్కరించారు.

## అనుచిత వ్యాఖ్యలు చేస్తే చర్యలు తప్పవు

**సూర్య,బీర్కూర్**



స్థానిక ఎన్నికల సందర్భంగా గ్రామాలలో ఒకరిపై ఒకరు అనుచిత వ్యాఖ్యలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్సై మహేందర్ హెచ్చరించారు. బైరాపుర్ గ్రామంలో ఎన్నికల సందర్భంగా గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళి ప్రకారం శాంతియుతంగా ఎన్నికలు జరుపుకోవాలని ఒకరిపై ఒకరు దూషణలు కానీ, వ్యక్తిగతంగా సోషల్ మీడియాలో కానీ అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఎస్పీ ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకొని జైలుకు పంపడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది గ్రామస్తులు ఉన్నారు.

## బ్యాంకులు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలి

**- జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పప్పుల రాజేంద్రప్రసాద్**

**సూర్య కామారెడ్డిజిల్లా ప్రతినిధి**



బ్యాంకులు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించి ఖాతాదారుల మన్ననలు పొందాలని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పప్పుల రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం కరూర్ వైశ్య బ్యాంక్ నూతన శాఖ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా హాజరై ఆయన మాట్లాడారు. ఖాతాదారులకు ఇబ్బందులు లేకుండా సేవలు అందిస్తే బ్యాంకుల అభిమానాన్ని ఖాతాదారులు చూర గోనె విధంగా సేవలు అందించాలని కోరారు. కామారెడ్డిలో వ్యాపార రంగంలో అధిక మొత్తంలో వైశ్యులు ఉన్నారని కరూర్ వైశ్య బ్యాంక్ తమ బ్యాంకు అనే అనుభూతి కలుగుతుంది అన్నారు. ఖాతాదారులు ముఖ్యంగా సేవలకె ప్రాధాన్యత ఇస్తారని మరో ప్రముఖ పారిశ్రామికవేత్త , పౌరసరఫరాల శాఖ కాంట్రాక్టర్ గౌరీ శెట్టి లక్ష్మీరాజం అన్నారు. మెరుగైన సేవలందించినప్పుడే ఖాతాదారులు బ్యాంకుల కు అభిమానం చూపుతారని ప్రముఖ నేత్ర వైద్యురాలు డాక్టర్ గీరెడ్డి అనూష అన్నారు. ఈ కార్యక్రమంలో కరూర్ వైశ్య బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కిషోర్ వర్మ, డి వో వో ఐ వి సుబ్రహ్మణ్యం శెట్టి, బ్రాంచ్ మేనేజర్ ఆకుల రవీందర్, బ్యాంకు సిబ్బందితోపాటు బ్యాంకు ఖాతాదారులు బంధం వేణు, శ్రీనివాస్, మాసుల లక్ష్మి నారాయణ, గైని శ్రీనివాస్ గౌడ్, అధిక సంఖ్యలో ఖాతాదారులు పాల్గొన్నారు.

## శ్రీ సరస్వతీ మమహా క్షేత్రం...9వ వార్షికోత్సవం

**సూర్య కామారెడ్డి టౌన్**

తేదీ07-12-2025 ఆదివారము నాడు శ్రీ సరస్వతీ మాత 9 వ వార్షికోత్సవము బ్రహ్మశ్రీ అష్టకాల నరసింహారామ శర్మ గారి దివ్య ఆశీస్సులతో బ్రహ్మశ్రీ అష్టకాల విద్యా మనోహర్ శర్మ గారి ఆధ్వర్యంలో నిర్వహించబడును , తేదీ 07-12-2025 ఆదివారము నాడు ఉదయం 5 గంటల నుండి ప్రధాన దేవతలకు పంచామృత అభిషేకము విశేషాలంకరణము పూజా కార్యక్రమం నిర్వహించబడును, ఉదయం ఎనిమిది గంటల నుండి గణపతి పూజ కలశప్రతిష్ట నవగ్రహారాధన ఉదయం10 గంటల నుండి సరస్వతీ యజ్ఞము యాగ్నికులు బ్రహ్మశ్రీ గౌరీభట్ల నాగరాజ శర్మ మరియు బ్రహ్మశ్రీ పార్వేళ్ళ శ్రీధర్ శర్మ గార్లచే నిర్వహించబడును, మధ్యాహ్నం ఒంటిగంటలకు శ్రీ సరస్వతీ క్షేత్ర ధర్మాధికారి అనంతసాగర్ బ్రహ్మశ్రీ అష్టకాల విద్యా మనోహర్ శర్మ మరియు వేద పండితులు బ్రహ్మశ్రీ గంగవరం ఆంజనేయ శర్మ గార్లచే ధార్మిక ప్రవచనములు ఉండును , తదుపరి తీర్థ ప్రసాదములు " అన్న ప్రసాద వితరణ " కలదు. భక్తులు ఎవరైనా కానీ అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాలుపంచుకొను వారు తమకు తోచిన విధంగా అనగా ధన రూపకముగా కానీ వస్తు రూపకముగా కానీ మందిరంలో అర్పించి తగురసీదు పొందగలరని ఆలయ దాత ధర్మకర్త పార్సి విటల్ పటేల్ తెలియజేశారు.

## డిక్లరేషన్ అమలు చేయాలి

**-కామారెడ్డి లో ఘనంగా పోలీస్ కిష్టయ్య వర్ధంతి వేడుకలు**

**-ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పున్న రాజేశ్వర్, జిల్లా అధ్యక్షులు గజ్జెల బిక్షపతి**

**సూర్య కామారెడ్డి టౌన్**



కామారెడ్డి డిక్లరేషన్ లో పేర్కొన్న అంశాలను అమలు చేయాలని రాష్ట్ర ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షులు పున్న రాజేశ్వర్, జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గజ్జల బిక్షపతి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రం లో పోలీసు కిష్టయ్య వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కిష్టయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్, బిక్షపతి లు మాట్లాడుతూ ముదిరాజుల ను బీసీ డీ గ్రూపు నుంచి బీసీ ఏ గ్రూపునకు కు మార్చిన జీవోను పునరుద్ధరించాలని కోరారు. పోలీసు కిష్టయ్య "మలి దశ తెలంగాణ " ఉద్యమానికి ఊపిరి పోసాడని, తన ప్రాణాలను సైతం తెలంగాణకు అర్పించాడని వారు కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు, బీసీ జేఏసీ కో కన్వీనర్ నీల నాగరాజు మాట్లాడుతూ పోలీస్ కిష్టయ్య ఆశయాలను కొనసాగిస్తామన్నారు. కామారెడ్డి జిల్లాను పోలీస్ కృష్ణయ్య జిల్లాగా మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు భూపాల్ గోపాల్, బట్టు సుశీల్, కనకంటి రాజు, మాణిక్యరాములు, ముదిరాజ్ సంఘాల నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా

**- ఉత్తమ రక్తదాత పురస్కారాన్ని అందుకున్న డాక్టర్ బాలు**

**సూర్య కామరెడ్డి జిల్లా ప్రతినిధి**



కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ నివారణ సంస్థ ఆధ్వర్యంలో వరల్డ్ ఎయిడ్స్ డే 2025 ను పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు కు ఉత్తమ రక్తదాత గా ప్రశంస పురస్కారాన్ని జిల్లా డిఎమ్ హెచ్ఓ విద్యారాన్ వల్కర్, నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ శరత్ లు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రశంస పురస్కార గ్రహీత డాక్టర్ బాలు మాట్లాడుతూ వ్యక్తిగతంగా 78 సార్లు రక్తదానం చేయడమే కాకుండా, 2007వ సంవత్సరం నుండి ఆపదలో ఉన్న వారికి సకాలంలో రక్తాన్ని అందజేయడం జరుగుతుందని, ఇప్పటివరకు 25 వేల యూనిట్ల రక్తాన్ని సేకరించడం,350 కు పైగా రక్తదాన శిబిరాలను నిర్వహించడం జరిగిందని,2023 వ సంవత్సరం నుండి తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తూ ఐదు వేల యూనిట్ల రక్తాన్ని తక్కువ సమయంలో సేకరించి ప్రతిష్టాత్మకమైన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో గుర్తింపు దక్కించుకున్న సంస్థలుగా కామారెడ్డి రక్తదాతల సమూహం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్) సంయుక్తంగా నిలిచాయని అన్నారు.రక్తదానానికి సహకరించుచున్న రక్తదాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఐసిటిసి కౌన్సిలర్ నాగరాజు,డిఆర్పి సుధాకర్,వర్ద ఆర్గనైజేషన్,యస్ యస్ కె సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ

**సూర్య బోధన్**



బోధన్ పట్టణంలో శనివారం రాత్రి యాచకులకు, బీద వారికి రోడ్డు ప్రక్కన దుకాణ సముదాయాల ప్రక్కనముందు ఇల్లు లేక అరుబయటే చలికి వణుకుతూ నిద్రిస్తున్న యాచకులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపట్టారు. దుప్పట్లతో పాటుగా భోజనం ప్యాకెట్లు కూడా వితరణ చేశారు. కార్యక్రమంలో బోధన్ పట్టణ సీఐ వెంకట్ నారాయణ, ఎస్సై భాస్కర్ చారి, చేయూత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు జాదవ్ ప్రవీణ్ నాయక్, ఉప్పరి శ్రీకాంత్, మంగలి భూమన్న బంతిలాల్ నాయక్, అనిల్ యాదవ్, వినోద్ కుమార్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## తెరవే ఆధ్వర్యంలో గ్రంథాలయానికి పుస్తకాలవితరణ

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



తెలంగాణ రచయితల వేదిక కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయానికి కవులు తమ రచనలను అందజేశారు ఈ సందర్భంగా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రచయితల వేదిక కామారెడ్డి జిల్లా బాధ్యులు కవులు తమ రచనలను గ్రంథాలయానికి అందించడం వల్ల పాఠకులకు ఈ ప్రాంత కవుల రచనలు చదివే అవకాశం లభిస్తున్నదని సాహిత్య పరంగా ఈ ప్రాంతం ప్రాముఖ్యతను సంతరించుకుందని మేటి రచనలను అందించి గ్రంథాలయానికి సహకరించడం పట్ల వారి నిబద్ధత చాటుకు న్నారని అన్నారు తెరవే జిల్లా అధ్యక్షులు గఫూర్ శిక్షక్ ఈ సందర్భంగా కవులకు అభినందనలు తెలిపారు గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి తమ విలువైన పుస్తకాలను అందించినందుకు కవులను ఘనంగా సన్మానించి జిల్లాలోని ప్రతి శాఖ గ్రంథాలయానికి చేరే విధంగా ప్రయత్ని స్తానని అన్నారు ఈ కార్యక్రమంలో తెరవే జిల్లా బాధ్యులు ఎనిశెట్టి గంగా ప్రసాద్ మందపీతాంబర్ నాగభూషణం. కాశ నరసయ్య తమ తమ రచనలే కాకుండా ఎన్నిల ముచ్చట్లు కార్యక్రమంలో రూపొందిన కవితా సంపుటాలను గ్రంథాలయానికి అందించారు.

# ఎల్లారెడ్డి ట్యాంక్ బండ్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే మదన్ మోహన్

**సూర్యఎల్లారెడ్డి**

ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే మదన్ మోహన్ అన్నారు. ఎల్లారెడ్డి పెద్దచెరువుపై జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పెద్ద చెరువుపై జరుగుతున్న మినీ ట్యాంక్ బండ్ పనులను పరిశీలించారు. ఎల్లారెడ్డి పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేం దుకు మినీ ట్యాంక్ బండ్ పనులను సకాలంలో పూర్తి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వాకింగ్ ట్రాక్ లైటింగ్, పార్క్, గార్డెన్, ఓపెన్ జిమ్, క్యాంటిన్, బోటింగ్ తదితర వసతులు కల్పించేం దుకు రూ. 3 కోట్ల ప్లాంటేషన్ పనుల కోసం నిధులు



మంజూరయ్యాయన్నారు. పట్టణ ప్రజలకు ఈ వసతులు అందుబాటులోకి వచ్చేలా అధికా రులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యాటకంతో ట్యాంక్బండ్ కు కొత్తశోభ వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఎల్లారెడ్డి బస్టాండ్ను పరిశీలించారు. బస్టాండ్ లో ఏర్పాటుచేసిన క్యాంటీన్లో కార్యకర్తలతో కలిసి అల్పాహారం చేశారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అన్ని హంగులతో బస్టాండ్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎల్లారెడ్డి నుంచి ఇతర ప్రాంతాలకు ట్రాన్స్ఫర్ చేసేందుకు ఏర్పాటుచేసిన పార్సిల్ సర్వీస్ను సైతం ఆయన పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని వాళ్లకు సూచించారు. ఆయనతో పాటు స్థానిక కాంగ్రెస్, పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, మాజీ మున్సిపల్ చైర్మన్ పద్మ, శ్రీకాంత్, నాయకులు విద్యాసాగర్ , నాగం గోపికృష్ణ, తదితరులు, పాల్గొన్నారు.

# ఒలింపిక్స్ కు ప్రాతినిధ్యం వహించడమే లక్ష్యంగా సన్నద్ధం కావాలి

## - విద్యార్థులకు ప్రేరణ కల్పించిన కలెక్టర్ - క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని హితవు

**సూర్య నిజామాబాద్, జిల్లా ప్రతినిధి**

ఒలింపిక్స్ క్రీడా పోటీలలో ప్రాతినిధ్యం దక్కేలా స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి విద్యార్థిని, విద్యార్థులకు ఉద్బోధించారు. అంకిత భావంతో కఠోర సాధన చేస్తే ఒలింపిక్స్ లక్ష్యం సాధించవచ్చని ప్రేరణ కల్పించారు. జక్రాన్పల్లి మండలం పడకల్ గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న పలువురు విద్యార్థిని, విద్యార్థులు వాలీబాల్ క్రీడలో జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని ప్రతిభను చాటడం, పూర్వ విద్యార్థులు స్పోర్ట్స్ కోటాలో వివిధ శాఖలలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన విషయాలను గమనించిన కలెక్టర్, విద్యార్థులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. క్రీడల్లో రాణించడం వల్ల సమకూరే ప్రయోజనాల గురించి వారికి సవివరంగా తెలియజేశారు. విద్య, ఉద్యోగావకాశాల్లో ప్రత్యేక రిజర్వేషన్ తో పాటు, ఎంతో పేరు, ప్రఖ్యాతులు వస్తాయన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకే పరిమితం కాకుండా ఒలింపిక్స్ క్రీడలలో పాల్గొనే స్థాయికి చేరుకునేలా



నిరంతర సాధన ద్వారా ప్రతిభను మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఒకే పాఠశాల నుండి వంద మందికి పైగా జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలలో పాల్గొనే అవకాశం లభించడం గొప్ప విషయమని, గ్రామాభివృద్ధి కమిటీ తనవంతు తోడ్పాటును అందిస్తుండడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు మరింత పట్టుదలతో కృషి చేస్తే ఒలింపిక్స్ స్థాయికి చేరడం కష్టమేమీ కాదన్నారు. ఈ దిశగా స్పష్టమైన ప్రణాళికను రూపొందించుకుని విద్యార్థులకు నాణ్యమైన తర్ఫీదును అందించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి వ్యాయామ ఉపాధ్యాయుడు, వాలీబాల్ కోచ్ శ్రీనివాస్ ను ఆదేశించారు. ప్రస్తుతం జాతీయ స్థాయిలో రాణిస్తున్న విద్యార్థులను అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక అయ్యేలా సన్నద్ధం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై, చేయాల్సిన కృషి గురించి సమగ్ర అధ్యయనం చేసి పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని సూచించారు. క్రీడల్లో ఆసక్తి కనబర్చే విద్యార్థిని, విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో విద్యార్థులు సాధించిన పతకాలు, మెమొంటోలు, ట్రోఫీలను కలెక్టర్ పరిశీలించి, క్రీడాకారులను, కోచ్ ను అభినందించారు. అంతకుముందు పాఠశాలలో విద్యార్థులు కోసం వండిన మధ్యాహ్న భోజనం నాణ్యతను కలెక్టర్ తనిఖీ చేశారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, సరుకుల నాణ్యత విషయంలో రాజీ పడకూడదని, వంట గ్యాస్ పైనే భోజనం వండాలని సూచించారు. పాఠశాలలో మిషన్ భగీరథ మంచినీటి వసతి, బాలబాలికలకు వేర్వేరు టాయిలెట్స్, గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు తదితర వసతులను పరిశీలించారు. కిచెన్ గార్డెన్ నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక అధికారులు ఉన్నారు.

# డిసెంబర్ 4న కర్షక్ బీఈడీ కళాశాలలో " " "అధునాతన ఎగ్జిబిషన్ "

**సూర్య కామారెడ్డి టౌన్**

కామారెడ్డి జిల్లా విద్యాశాఖ పర్యవేక్షణలో నేషనల్ గ్రీన్ కోర్ (NGC) ఆధ్వర్యంలో EXHIBITION ON WASTE TO WEALTH ( WEALTH OUT OF WASTE) ...బెస్ట్ ఫ్రం వేస్ట్ మరియు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్/మేళ... ఈనెల 4.12.2025 రోజున కర్షక్ బీఈడీ కళాశాల లో ఉదయం 10 గంటల నుండి నిర్వహించనున్నట్లు డి.ఎస్.ఓ సిద్ధరాంరెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. అందుబాటులో ఉన్న వ్యర్థ పదార్థాలైన ప్లాస్టిక్ బాటిల్స్, వార్తాపత్రికలు ,కార్డు బోర్డు, ఎలక్ట్రానిక్ వేస్ట్ పదార్థాలు అయినటువంటి పాత కంప్యూటర్లు ,A/C లు కొబ్బరి చిప్పలు వంటి వ్యర్థ పదార్థాల నుండి " ECO FRIENDLY INNOVATIVE PROJECTS" ( అలంకరణ సామాగ్రి) తయారుచేసి వీటిని ప్రదర్శించగలరని మనవి. 1) ప్రతి పాఠశాల నుండి ఇద్దరు విద్యార్థులు మరియు ఒక గైడ్ టీచర్ వారు తయారు చేసిన ప్రాజెక్టులతో హాజరు కావాలి . 2) ఉదయం 10 గంటలకు వరకు కర్షక్ బీడీ కాలేజ్ కు చేరుకొని సెమినార్ హాల్లో మీకు కేటాయించిన స్థానంలో ప్రదర్శించవలెను . 3) ఇందులో పాల్గొనే ప్రతి విద్యార్థికి మరియు గైడ్ టీచర్ కు పార్టిసిపేషన్ సర్టిఫికెట్స్ ఇవ్వబడును. 4) విద్యార్థులు మరియు గైడ్ టీచర్లకు భోజన వసతి కలదు. 5) మొదటి బహుమతిగా నగదు పురస్కారం ఇవ్వబడును. కావున కామారెడ్డి డివిజన్లోని అన్ని యాజమాన్య పాఠశాల ప్రధానోపాధ్యాయులు మీ పాఠశాలలోని విద్యార్థులచే చక్కటి ప్రదర్శనలను తయారు చేపించి 4.12.2025 రోజున కర్షక్ బీఈడీ కళాశాల లో నిర్వహించే ఈ ప్రదర్శనలో పాల్గొనేటట్లు చర్యలు తీసుకోవాల్సిందిగా మనవి. త్వరలోనే గూగుల్ ఫామ్ పంపించబడుతుంది. దీని ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి.

**NOTE:**: ఎల్లారెడ్డి మరియు బాన్సువాడ డివిజన్లో త్వరలోనే మరొక ఎగ్జిబిషన్ బాన్సువాడలో నిర్వహించబడుతుంది. వేదిక మరియు తేదీలను త్వరలోనే ప్రకటించడం జరుగుతుంది. కావున బాన్సువాడ ఎల్లారెడ్డి డివి జన్లోని పాఠశాలల విద్యార్థులు బాన్సువాల్లో నిర్వహించే ఎగ్జిబిషన్లో పాల్గొనే విధంగా ప్రాజెక్టులు రూపకల్పన చేసుకుని సిద్ధంగా ఉండవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

# ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ లో చేరిన బీఆర్ఎస్ కార్యకర్తలు

**సూర్య, నాగిరెడ్డిపేట్**

నాగిరెడ్డిపేట్ మండలంలోని ఆత్మకూరు గ్రామానికి చెందిన 36 మంది బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, సోమవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు సమక్షంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకెళ్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా అనేక సంక్షేమ పథకాలు ఇక్కడ అమలవుతున్నాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలనుకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు కార్యకర్తలు జోరుగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు.



ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మాజీ సర్పంచ్ గడ్డం బాల్రెడ్డి, నాయకులు రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

## - కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**



నిజామాబాద్ నగర పాలక సంస్థ పరిధిలో సదుపాయాల మెరుగుదల కోసం చేపట్టిన అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన నగర పాలక సంస్థ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఇంజినీరింగ్ విభాగం అధికారులతో అభివృద్ధి పనుల ప్రగతిపై సమీక్ష జరిపారు. ఒక్కో జోన్ వారీగా మంజూరైన పనుల గురించి ప్రస్తావిస్తూ, ప్రస్తుతం అవి ఏ దశలో ఉన్నాయి, ఏ మేరకు నిధులు ఖర్చు చేశారు, ఎక్కడెక్కడ సదుపాయాల పునరుద్ధరణ జరిగింది తదితర వివరాలను ఆరా తీశారు. ఈ సందర్భంగా పలు డివిజన్లలో సీ.సీ, బీ.టీ రోడ్ల ప్యాచ్ వర్క్ పనులు, రోడ్ల నిర్మాణాలు ఇంకనూ ప్రారంభం కాకపోవడం పట్ల కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సకాలంలో పనులు చేపట్టి, నిర్ణీత గడువు లోపు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లతో ఒప్పందం ఉన్నప్పటికీ, పనులను ఎందుకు ప్రారంభించలేదని నిలదీశారు. మైల్ స్టోన్ ప్రకారం నిర్ణీత గడువు లోపు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, పనులు చేపట్టకపోతే అగ్రిమెంట్ రద్దు చేసుకుని సదరు కాంట్రాక్టర్ ను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశించారు. ప్రజలకు సౌకర్యాల కల్పన విషయంలో ఎంతమాత్రం రాజీ పడకూడదని, కాంట్రాక్టర్లకు వత్తాసు పలికే ధోరణిని అవలంభిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్ల నిర్మాణం, మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు తదితర అన్ని రకాల పనుల ప్రగతి గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాప్యానికి తావు లేకుండా ఆయా విభాగాల వారీగా పనులను విభజించుకుని, ఏకకాలంలో జరిగేలా చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. గడువు లోపు పనులన్నీ పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని అన్నారు. ఏ చిన్న పని కూడా పెండింగ్ లో ఉండకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, నాణ్యతతో పనులు జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. తదుపరి సమీక్ష జరిపే సమయానికి అన్ని పనులు ప్రారంభమై, స్పష్టమైన పురోగతి కనిపించాలని అన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ సహాయ రవీంద్రసాగర్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

# చైక్ పోస్టుల వద్ద వాహనాలను పకడ్బందీగా తనిఖీలను నిర్వహించాలి

## - ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసారథి రెడ్డి

**సూర్య, నాగిరెడ్డి పేట్**

గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా చెక్ పోస్టుల వద్ద పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ పకడ్బందీగా వాహనాలను తనిఖీలు జరపాలని ఎల్లారెడ్డి ఆర్ డి ఓ పార్థ సింహారెడ్డి తెలిపారు. ఆయన సోమవారం కామారెడ్డి జిల్లా సరిహద్దు ప్రాంతమైన పోచారం గ్రామం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు చెక్ పోస్టు ను సందర్శించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున డబ్బులను, మద్యాన్ని ఎవరు తరలించకుండా గట్టి నిఘా పెట్టాలని, జిల్లాలోకి వచ్చిపోయే ప్రతి వాహనాన్ని చెక్ పోస్టు వద్ద తనిఖీలు జరపాలని ఆదేశించారు. చెక్ పోస్టు సిబ్బందికి పలు సూచనలిచ్చారు. అనంతరం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ స్వీకరణ కేంద్రాలను తనిఖీ చేశారు. నామినేషన్ల సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పకడ్బందీగా బందోబస్తు నిర్వహించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియామళిని అందరూ పాటించాలన్నారు

